


## నవ్య నీరాజనం

# సమాజానికి తిరిగి ఇవ్వడం మన బాధ్యత

**-ఎమ్.వి.రాయుడు**

‘ఈ దేశం ఏమి ఇచ్చిందని అడగకండి, ఈ దేశానికి ఏం చేశాం అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి’ అంటూ జాన్ ఎఫ్ కెనడీ ఐదు దశాబ్దాల క్రితం అమెరికా అధ్యక్ష ప్రమాణ స్వీకారోత్సవం(1961 జనవరి 20)లో యువతరానికి పిలుపు ఇచ్చారు. శిలాశాసనంలాంటి ఆ సందేశం ఎల్లలకు అతీతంగా ఎందరికో స్ఫూర్తి నిస్తుంది.

‘థింక్ గ్లోబల్లీ యాక్ట్ లోకల్లీ’ అన్న చందంగా అలాంటి స్ఫూర్తినే జీర్ణించుకున్నారు ఎమ్మెస్సీ బయో మెడికల్ ఇంజనీరింగ్ చేసి పారిశ్రామికవేత్తగా బెంగళూరులో స్థిరపడిన ఎమ్.వి.రాయుడు.

‘మనసు ఫౌండేషన్’ స్థాపించి మన గొప్ప రచయితల సర్వ లభ్య రచనల సంకలనాలు (కలెక్టెడ్ వర్క్స్) వెలువరిస్తూ తెలుగు సాహిత్యానికి ఆయన కొత్త శోభను చేకూరుస్తున్నారు.

సమాజాన్ని కొత్త అవగాహనతో దర్శించిన రాయుడులో, తాను మేలు పొందిన సమాజానికి బాధ్యతగా ఎంతో కొంత చేయాలన్న PASSION, ఆరాటం, కమిట్‌మెంట్ కనిపిస్తుంది.

ఆయనింట్లో అడుగుపెట్టినప్పుడు పాత, కొత్త పుస్తకాల పరిమళం గుబాళిస్తుంది. సమాజాన్ని ఎంతో కొంత ప్రభావం చేసిన ‘మనసు’ ఫౌండేషన్ ఎమ్.వి.రాయుడు పదునయిన మాటల దారుల్లో విహరిద్దాం పదండి....

### బాల్యం

ప్రకాశం జిల్లా ఒంగోలుకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న లింగగుంట మా స్వగ్రామం. ఆరు వందల సంవత్సరాల క్రితమే ఏర్పడిన గ్రామం (మా వూరి చరిత్రను సేకరించాను) అది. మాది వ్యవసాయ కుటుంబం. మా నాన్న మన్నం నరసింహం. అమ్మ సుబ్బమ్మ. 1954 ఫిబ్రవరి 4వ తేదీన నేను పుట్టాను. మా తాత గారి పేరే నాకూ పెట్టారు మన్నం వెంకట రాయుడు (ఎమ్.వి.రాయుడు) అని. మా నాన్నకు నన్ను డాక్టరును చేయాలనే కోరిక. విజయవాడ లయోలా కాలేజీలో పి యూ సీ పూర్తి చేశాక నాకు బై పీ సీ సబ్జక్టు పడదని అర్థం అయ్యింది. ఆ తర్వాత మద్రాసులో మూడు నెలలపాటు చేసిన హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు కూడా ఒంటికి సరిపడదని తేలింది. ఇక లాభం లేదని ఒంగోలు సిఎస్ఆర్ శర్మ కాలేజీలో బిఎస్సీ డిగ్రీ కోర్సు చేశాను.

### మలుపు తిప్పిన ఐఐఎస్సీ చదువు

డిగ్రీ తర్వాత బెంగుళూరులోని అప్పటి ఐ ఐ ఎస్సీ ద్వారా ఆలిండియా ప్రవేశ పరీక్ష రాసి ఇంజనీరింగ్‌లో సీటు సాధించాను. మద్రాసు ఐ ఐ టి లో ఇంటర్వ్యూ కోసం బయలుదేరి బస్టాండుకు చేరుకోగానే మా వూరి కుర్రాడు పరుగు పరుగున వచ్చి ఐ ఐ ఎస్సీలో సీటు వచ్చినట్లు పంపిన లెటర్ నాకు అందించాడు.అదే నా జీవితాన్ని మలుపు తిప్పింది. ఐ ఐ ఎస్సీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బ్రాంచిలో ఇంజనీరింగ్ బి.ఇ. పూర్తి చేశాను.

### సాహిత్యం,కళల పట్ల ఆసక్తి

ఐ ఐ ఎస్సీ నాకో కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. అక్కడ పరిశోధన చేసే విద్యార్థులే ఎక్కువ. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులతో పరిచయం, ప్రొఫెసర్లతో జంకూ, గొంకూ లేకుండా మాట్లాడటం సరికొత్త అనుభవం. చదువుతోపాటు సాంస్కృతిక రంగంలోనూ పాల్గొనే అవకాశం కలిగింది. సహ

విద్యార్థి నుండి ఆంగ్ల సాహిత్యం చదివే అలవాటు నేర్చుకున్నాను.

బాల్యం నుండి పుస్తకాలు బాగా చదివేవాడిని. ఒంగోలులో రెండు గ్రంథాలయాలు నాకు బాగా ఉపయోగపడ్డాయి. బెంగళూరులో జింఖానా లైబ్రరీ, జె ఆర్ డీ టాటా జనరల్ లైబ్రరీ ఉండేవి. సాయంత్రాలు గంటలు గంటలు అక్కడే. అప్పుడే 1974 లో ప్రముఖ రచయిత కవనశర్మగారిని 'తెలుగు సమితి' సాహితీ సంస్థ కార్యక్రమంలో కలిశాను. వివిన మూర్తిగారి పరిచయం కూడా అక్కడే.

## చైతన్య సాధన

ఏ విషయంపైన అయినా స్పష్టమైన అవగాహన ఉండాలని నమ్ముతాను. అందుకు ఐ ఐ ఎస్సీ చదువు నాకు బాగా ఉపయోగపడింది. అక్కడ దొరికే పుస్తకాలు, విద్యార్థుల ఆలోచనా ధోరణులు నా దృక్పథాన్ని బాగా విస్తృతం చేశాయి. అప్పట్లో భరత్ ఝుంఝున్‌వాలా మాకు ఐ ఐ ఎమ్ ఫేకల్టీగా ఉండేవారు. ఆయన అనేక అంశాలపై చేసే విశ్లేషణలు నన్ను బాగా ఆకట్టుకునేవి. మురికివాడల జీవనాన్ని తెలుసుకోవడానికి ఆయన మురికివాడలోనే నివశించేవారు. 1977లో ఎమర్జెనీ తర్వాత అందరిలోనూ చైతన్యం వచ్చింది. సమాజ అభివృద్ధిపై అవగాహన కోసం ఓపెన్‌ఫోరం ఏర్పాటు చేసి చర్చలు జరిపేవాళ్ళం.

## కెరీర్

ఐ ఐ ఎస్సీలో ఎమ్మెస్సీ బయోమెడికల్ ఇంజనీరింగ్ చేసి ప్రాజెక్టు కన్సల్టెంటుగా, హెసిఎల్‌లో కొంతకాలం చేసి తర్వాత సౌదీ అరేబియాలో ఏడేళ్ళపాటు పనిచేశాను. మధ్యతరగతి కుటుంబ జీవిగా ఎంత కావాలో అంతే బ్యాంకు బ్యాలన్సుతో 1988 నవంబరులో స్వదేశం తిరిగి వచ్చాను. ఇందుకు నన్ను అర్థం చేసుకున్న నా భార్యకు కృతజ్ఞతలు చెప్పుకుంటాను (నవ్వు). తర్వాత బెంగుళూరులో స్నేహితులతో కలిసి ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీ పెట్టాం.

## తపన

సమాజానికి అవసరమైనదేదో చెయ్యాలని అనిపించింది. ఆ కోరిక పెరిగిపెద్దదవుతూ వచ్చింది. అందుకు నేను వేసిన తొలి అడుగు బహుశా శ్రీశ్రీ మహాప్రస్థానం, మరో ప్రస్థానం కవితల నుంచి ఎంపిక చేసిన వాటిని కన్నడం లోకి అనువాదం చేయించటం. మొత్తం మూడు పుస్తకాలుగా తీసుకువచ్చాం. తెలుగు సమాజాన్ని కదిలించిన శ్రీశ్రీ కన్నడ సమాజాన్ని కదిలించకుండా ఉంటాడా! అద్భుతమైన స్పందన వచ్చింది. కన్నడ బండాయ సాహిత్యం వారి సమావేశం కోసం 1979లో శ్రీశ్రీ బెంగుళూరు వచ్చారు. అప్పుడే ఆయన్ని కలిశాను.

## రచయితల సమగ్ర సాహిత్యానికి ప్రేరణ

నేను ఐ ఐ ఎస్సీలో ఉండగా పి ఎల్ 480 నిధుల కింద ఇండియాలో చాలా పుస్తకాలు విడుదల అయ్యేవి. వాటిల్లో నేను చదివిన కంప్లీట్ వర్క్స్ ఆఫ్ షేక్స్పియర్ ప్రేరణతో ఇలాంటివి తెలుగు రచయితలవి ఎందుకు రావడం లేదన్న ఆలోచన వచ్చింది. పైగా 'కథా నిలయం' కోసం ఏదైనా చేద్దామని అడిగిన డాక్టర్ నరేంద్రనాథ్ కోరిక కూడా తోడయ్యింది. దాంతో 1998-99 లో కాళీపట్నం రామారావుగారి రచనల సర్వస్వం (కంప్లీట్ వర్క్స్) ప్రొగ్రెసివ్ పబ్లికేషన్స్ పేరుతో (అప్పటికి మనసు ఫౌండేషన్ ఏర్పడలేదు) ముద్రించాం. దీని ద్వారా వచ్చిన డబ్బు కథానిలయానికి ఇచ్చేద్దాం అనుకున్నాం.

## మనసు ఫౌండేషన్ ప్రచురణలు

ప్రతి ఒక్కడూ సమాజం నుండి లాభపడతాడు. తిరిగి ఆ సమాజానికి ఎంతో కొంత ఇచ్చి సమాజం ఋణం తీర్చుకోవాలి. అలాంటి ఆలోచన లోంచి పుట్టినదే 'మనసు ఫౌండేషన్'. మా ఇంటిపేరు, మా అమ్మా నాన్నల పేర్లలోని మొదటి అక్షరాలు తీసి (మ న సు) ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేశాను. తమ రచనలతో సమాజాభివృద్ధికి కృషి చేసిన రచయితల సమగ్ర రచనలు తీసుకురావడం, 19వ శతాబ్దంలో తెలుగు సమాజాన్ని ప్రతిఫలించిన తెలుగేతర రచయితల రచనల్ని తెలుగులోకి తీసుకురావడం నా లక్ష్యాలు. అలా 2007లో మనసు ఫౌండేషన్ మొదటి ప్రచురణగా రావిశాస్త్రిగారి సర్వ లభ్య రచనల సంకలనం (కలెక్టెడ్ వర్క్స్) తీసుకువచ్చాం. తర్వాత ఆయన రచనల్ని అప్‌గ్రేడ్ చేసి రెండవ ప్రచురణగా తెచ్చాం. అలాగే 'రొషాంబు క్లౌ' అనే ఆవిడ రాసిన WHILE SEWING SANDALS (1899లో ఒంగోలు ప్రాంత మాదిగల జీవితాలను ప్రతిబింబించిన సమగ్ర రచన) ను 'చెప్పులు కుడుతూ కుడుతూ' (వివిన మూర్తి అనువాదం) అనువాదాన్ని 2008లో తెలుగులో తీసుకువచ్చాం. 2010 లో శ్రీశ్రీ జయంతి రోజున 'శ్రీశ్రీ ప్రస్థాన త్రయం' (శ్రీశ్రీ కవితా,కథా,కదంబ ప్రస్థానాలు) గా ఆయన రచనల సర్వస్వాన్నీ వెలువరించాం. దీనిని శ్రీశ్రీ రచనల సర్వస్వమని చెప్పవచ్చు. ముళ్ళపూడి వారు ఈ పేరు సూచించారు. 2011లో బీనాదేవి రచనల సర్వస్వం, సర్ అర్థర్ కాటన్ కుమార్తె LADY HOPE ఇంగ్లీషులో రాసిన ఆయన జీవిత చరిత్రను తెలుగులోకి (కవనశర్మ అనువాదం) తెచ్చాం. అదే సంవత్సరం నవంబరులో 'మార్గదర్శి మన పంతులుగారు' (మా నాన్నగారు) జీవిత విశేషాలను తెలుగు, ఆంగ్ల భాషల్లో తెచ్చాం. 2012 సెప్టెంబరులో గురజాడ రచనల సర్వస్వాన్ని వెలువరించాం.

ఇంకా గుర్రం జాషువా, కె.సభా,శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి వంటి వారు మా జాబితాలో ఉన్నారు. లండన్ లైబ్రరీ నుండి సేకరించి తెచ్చిన 'కన్యాశుల్కం' ఫస్ట్ ప్రింటు, ఫ్రాన్స్ నుండి తెచ్చిన కన్యాశుల్కం 'ముందుమాట', కొన్ని ఉత్తరాలు కలిపి ప్రచురించబోతున్నాం.

## 'మనసు' కోర్ టీమ్

ఒక రచయిత సర్వ లభ్య రచనల్ని తీసుకురావడం ఒకరివల్ల కాదు. ఆ ప్రయత్నం వెనుక ఒక కోర్ టీమ్ ఉంటుంది. దీంట్లో 20 మంది ఉన్నారు. అందరూ అన్ని విధాలుగా ప్రయత్నాలు, కృషి చేస్తారు. సేకరించిన ఈ సమాచారంతో ఒక ఇండెక్స్ తయారు చేసి అందులో ఎన్ని రచనలు దొరుకుతాయి? ఎన్ని దొరకడం లేదు అనే అంచనాకు వస్తాం. వాటిల్లో ప్రథమ ముద్రణ ప్రతుల కోసం ప్రయత్నం చేస్తాం. ఒక రచయిత సర్వ లభ్య రచనల సేకరణకు మాకు ఒకటిన్నర సంవత్సరం నుండి మూడు సంవత్సరాల వరకు సమయం పడుతోంది.

## డాక్యుమెంటరీలు

దీంతోపాటు డాక్యుమెంటరీలు కూడా రూపొందిస్తున్నాం. ఇప్పటివరకు వెలువడిన రచనల డాక్యుమెంటరీలు పూర్తయ్యాయి. 600 సంవత్సరాలు చరిత్ర గల మా వూరు లింగం గుంట మీద కూడా డాక్యుమెంటరీ తీసుకురాబోతున్నాం. అయితే సర్వ లభ్య రచనల సంకలనం రూపొందించడంలో మాకు ప్రధానంగా ఎదురయ్యేది కాపీరైట్ సమస్య. వారసులను వెతికి పట్టుకుంటాం. వారిని ఒప్పించడం మరో సమస్య. కొందరు స్ఫూర్తితో ముందుకు వస్తారు. వీటికి అచ్చు తప్పులు సరిదిద్దడం (ప్రూఫ్ రీడింగ్) మరో సమస్య. ఈ విషయంలో కా.రా మాస్టారు, కవనశర్మ, బాలాజీ, శ్యామ్ నారాయణ, వివిన మూర్తి వంటి వారి చొరవ ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

## భవిష్యత్తు

సమాజానికి మనం ఏమి తిరిగి ఇవ్వగలం? అని చేసే ప్రయత్నాల్లో ఇలాంటి మంచి పుస్తకాల ప్రచురణ ఒక భాగం. నెల్లూరు జిల్లా వరికుంటపాడులో ఒక స్వయం పోషకత్వ వృద్ధాశ్రమాన్ని ఏడాది కాలం వ్యవధిలో ప్రారంభించబోతున్నాం. ఒక INTEGRATED ECO SYSTEMగా అది రూపుదిద్దుకోవాలన్న ఆకాంక్ష ఉంది. ఏమవుతుందో చూద్దాం. మన పనుల్లో భారతీయత ప్రతిబింబించాలన్న చిన్న కోరిక ఉంది.

## కుటుంబం

నా శ్రీమతి వైదేహి. నా కార్యక్రమాలన్నింటిలో తనకు భాగస్వామ్యం ఉంది. నా తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, కజిన్స్ వీళ్ళందరూ కూడా ఒక Extended familyగా సహాయ సహకారాలు అందిస్తున్నారు.

మాకు ఇద్దరు అబ్బాయిలు. పెద్దబ్బాయి 'జీ'. ఒకే అక్షరంతో పేరు పెట్టాలని మా కోరిక. అందుకే ఆ పేరు పెట్టాం. మొదటిపేరుతో రైమింగ్ ఉండాలని భావించి రెండో అబ్బాయికి 'జెన్' అని పేరు పెట్టాం. ఇద్దరు అబ్బాయిలూ జీవితంలో స్థిరపడ్డారు.

**-సి.యస్.రాంబాబు**


కుటుంబ సభ్యులతో..







